బీఆర్ఎస్ గెలుపుతోనే రాష్ట్రాభివృద్ధి

ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు



ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న రాగిడి లక్ష్మారెడ్డి

కూకట్‌పల్లి, మే 6 (ఆంధ్రజ్యోతి): పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థుల గెలుపు రాష్ట్రాభివృద్ధికి దోహదపడుతుందని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. మూసాపేటలోని వీఆర్ పార్కులో సోమవారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వాకర్స్‌తో మాట్లాడుతూ.. ఢిల్లీలో ప్రశ్నించే గొంతుకలుగా బీఆర్ఎస్ బాధ్యత తీసుకుంటుందన్నారు. బీఆర్ఎస్ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డిని భారీ మెజార్టీతోనే గెలిపించాలని కోరారు. మాజీ కార్పొరేటర్ తూము శ్రావణ్‌కుమార్, నాయకులు అంబటి శ్రీనివాస్, రాజ్‌కుమార్‌గౌడ్ పాల్గొన్నారు.

• మైనారిటీల అభ్యున్నతే బీఆర్ఎస్ లక్ష్యం

షాపూర్‌నగర్: ముస్లిం మైనారిటీల అభ్యున్నతి కోసం పని చేసిన ఏకైక పార్టీ బీఆర్ఎస్ అని మల్కాజిగిరి పార్లమెంట్ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి అన్నారు. సోమవారం సూరారం డివిజన్ షాపూర్‌నగర్‌లో గల ఎంజే గార్డెన్స్‌లో నిర్వహించిన ముస్లిం మైనారిటీల ఆత్మీయ సమ్మేళనంలో ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ పాల్గొన్నారు.

• కార్పొరేటర్ల ప్రచారం

బాలానగర్: రాగిడి లక్ష్మారెడ్డికి మద్దతుగా బీఆర్ఎస్ నాయకులు ఇందిరానగర్, శ్రీనగర్, రాజీవ్‌గాంధీనగర్, రాజీవ్‌గాంధీనగర్‌లలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్పొరేటర్ ఆవుల రవీందర్‌రెడ్డి ఆధ్వర్యంలో డివిజన్ నాయకులు, మహిళా కార్యకర్తలు బస్తీలలో ప్రచారం చేశారు.

• ఓల్డుబోయినపల్లిలో ప్రచారం

ఓల్డుబోయినపల్లి: బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డికి మద్దతుగా ఓల్డుబోయినపల్లి కార్పొరేటర్ ముద్దం నర్సింహ్మాయాదవ్ డివిజన్ నాయకులు కార్యకర్తలతో విస్తృత ప్రచారం చేపట్టారు. ప్రచారానికి ఇంకా 5 రోజుల గడువు మాత్రమే ఉంది.



మూసాపేట పార్కులో వాకర్స్‌తో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

నేటి నుంచి లక్ష్మీవేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు

కేపీహెచ్‌బీకాలనీ, మే 6 (ఆంధ్రజ్యోతి): లక్ష్మీవేంకటేశ్వర స్వామి ద్వాదశ (పుష్కర) వార్షిక బ్రహ్మోత్సవాలను ఈనెల 7 నుంచి 11వ తేదీ వరకూ నిర్వహిస్తున్నట్లు కాలనీ అధ్యక్షుడు అల్లూరి మురళీకృష్ణ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చినజీయర్ స్వామి మంగళ శాసనములతో శ్రీమాన్ కోసూరి రామకృష్ణమాచార్యులు పర్యవేక్షణలో జరిగే ఉత్సవాల్లో భాగంగా ఈనెల 9న శ్రీవారి కల్యాణం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఆలయ కమిటీ చైర్మన్ కుర్మయ్యగారి కొండల్‌రావు, తిలోత్తమ దంపతుల ఆధ్వర్యంలో అన్నసమారాధన ఉంటుందని తెలిపారు.

కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యం

కాంగ్రెస్ చేవెళ్ల ఎంపీ అభ్యర్థి రంజిత్‌రెడ్డి

హైదర్‌నగర్, మే 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రమైనా.. దేశమైన కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యమని శేరిలింగంపల్లి నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జి జగదీశ్వర్‌గౌడ్ అన్నారు. సోమవారం ఆల్విన్‌కాలనీ డివిజన్‌కు చెందిన సాయినగర్ ఈస్ట్, వెస్ట్, శివమ్మ బస్తీ నాయకులు, స్థానికులు కార్పొరేటర్ దొడ్ల వెంకటేగౌడ్, జగదీశ్వర్‌గౌడ్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బస్తీ కదులుతోంది.. వాడవాడలా కాంగ్రెస్ బలం పెరుగుతోందని, కాంగ్రెస్ అభ్యర్థి రంజిత్‌రెడ్డి భారీ మెజార్టీతో గెలవడం ఖాయమని తెలిపారు.

భారీగా చేరికలు

గచ్చిబౌలి, మే 6 (ఆంధ్రజ్యోతి): శేరిలింగంపల్లి డివిజన్‌కు చెందిన బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్ గూటికి చేరారు. సోమవారం శేరిలింగంపల్లి డివిజన్ నాయకులు కుమార్‌యాదవ్, శ్రీనివాసరెడ్డి, సత్యనారాయణయాదవ్ ఆధ్వర్యంలో పలువురు నేతలు నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జి జగదీశ్వర్‌గౌడ్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.



పార్టీలో చేరిన వారితో జగదీశ్వర్‌గౌడ్

• రాజేంద్రనగర్ అభివృద్ధికి కృషి

నార్సింగ్: బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్‌లో కాంగ్రెస్ అధ్యక్షుడు కృష్ణారెడ్డి, ఏ-బ్లాక్ అధ్యక్షుడు డప్పు నవీన్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు సోమవారం రాత్రి ర్యాలీ నిర్వహించారు. ర్యాలీ గంధంగూడ నుంచి హైదర్షాకోట్ చౌరస్తా వరకు జరిగింది. ముఖ్యఅతిథులుగా చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గం కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం రంజిత్‌రెడ్డి, టీఎమ్ఆర్ఈఐఎస్ అధ్యక్షుడు ఎండీ ఫాహీమ్ ఖురేషీ, రాష్ట్ర పాడి పరిశ్రమ అభివృద్ధి సంస్థ చైర్మన్ బొర్రా జ్ఞానేశ్వర్ ముదిరాజ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా రంజిత్‌రెడ్డి మాట్లాడుతూ.. రాజేంద్రనగర్ నియోజకవర్గం అభివృద్ధికి, సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని, అత్యధిక మెజారిటీతో తనను గెలిపించాలని కోరారు. బొర్రా జ్ఞానేశ్వర్ ముదిరాజ్ మాట్లాడుతూ.. రాజేంద్రనగర్ నియోజకవర్గంలో లక్ష ఓట్ల మెజారిటీతో రంజిత్‌రెడ్డి గెలవడం ఖాయమని జోస్యం చెప్పారు. రాజేంద్రనగర్ నియోజకవర్గంలో నిరుపేద కుటుంబాలకు 5000 పక్కా ఇళ్లు కటిస్తామని తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు సంజీవ్, ప్రేమ్‌కుమార్, లత ప్రేమ్‌గౌడ్, డిప్యూటీ మేయర్ రాజేందర్‌రెడ్డి, టింకు రెడ్డి, చంద్రశేఖర్, అస్లాం, రాజిరెడ్డి, సంగారెడ్డి, నరేందర్, మాజీ సర్పంచ్ హరికృష్ణ, సుధాకర్, బొగల శ్రీను, పీఎస్ కుమార్, బొర్రా జ్ఞాన్ అభిలాష్, గంగని అరుణ్, హరికృష్ణ, గణేశ్, ప్రవీణ్, అమీన్, ప్రేమ్, మక్బూల్ పాల్గొన్నారు.



పార్టీలో చేరిన వారితో ఇన్‌చార్జి జగదీశ్వర్‌గౌడ్, కార్పొరేటర్ వెంకటేష్‌గౌడ్



ర్యాలీలో రంజిత్‌రెడ్డి, బొర్రా జ్ఞానేశ్వర్ ముదిరాజ్, ఫాహీమ్ ఖురేషీ తదితరులు



ర్యాలీలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు

కుత్బుల్లాపూర్‌లో ముగిసిన మాక్‌పోల్

కుత్బుల్లాపూర్, మే 6 (ఆంధ్రజ్యోతి): పార్లమెంటు ఎన్నికల నేపథ్యంలో అధికారులు ఈవీఎంలను సిద్ధం చేశారు. నియోజకవర్గంలోని 590 పోలింగ్ కేంద్రాలకుగాను మొత్తం 740 కంట్రోల్ యూనిట్లు, 1,480 బ్యాలెట్ యూనిట్లు, 740 వీవీప్యాట్‌లను అధికారులు సిద్ధం చేసి సుచిత్రలోని లయోలా కళాశాలలోని స్ట్రాంగ్‌రూంలో భద్రపరిచారు. ఈ మేరకు వీటిలో 30 ఈవీఎంలను రాజకీయ పార్టీ ప్రతినిధుల సమక్షంలో ఎంపిక చేసి మాక్‌పోల్ (నమూనా ఎన్నిక) సోమవారం నిర్వహించారు. నియోజకవర్గ ఏఆర్వో పులి సైదులు ఆధ్వర్యంలో సెక్టోరల్ అధికారులు, సహాయకులు మాక్‌పోల్‌ను చేపట్టారు. ప్రతీ ఈవీఎంలో 1000 నమూనా ఓట్లను వేసి యంత్రాల పని తీరుతో పాటు వీవీప్యాట్‌లలో వచ్చే స్లిప్పులను పరిశీలించారు. అంతకుముందు ఈవీఎంలను ఈసీఐఎల్‌కు చెందిన నిపుణులైన ఇంజనీర్ల ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు సిద్ధం చేశారు. కార్యక్రమంలో ఈఆర్వో వి.నర్సింహ, ఏఈఆర్వోలు ఉదయ్‌కుమార్, పూల్‌సింగ్, రెహమాన్‌ఖాన్, సూపరింటెండెంట్ గిరిబాబు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

రాంగ్‌రూట్ డ్రైవింగ్.. కేసు నమోదు

మియాపూర్, మే 6 (ఆంధ్రజ్యోతి): మియాపూర్ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో సోమవారం స్పెషల్‌డ్రైవ్ నిర్వహించి రాంగ్‌రూట్‌లో ప్రయాణిస్తున్న వాహనదారులపై కేసులు నమోదు చేశారు. మియాపూర్ ట్రాఫిక్ ఎస్ఐలు సుభాష్, మల్లేశ్వర్, నవీన్‌కుమార్ బాచుపల్లి వీఎన్ఆర్ కళాశాల వద్ద రాంగ్‌రూట్‌లో వాహనాలు నడిపిన 10 ద్విచక్రవాహనాలపై కేసులు నమోదు చేసి బాచుపల్లి పోలీసులకు అప్పగించారు. అదేవిధంగా మియాపూర్ హెచ్‌డీఎఫ్‌సీ యూటర్న్, లేబర్ అడ్డ దగ్గర రాంగ్‌రూట్‌లో వాహనాలు నడిపిన 12 మంది పట్టుకుని మియాపూర్ పోలీస్‌స్టేషన్‌లో కేసులు నమోదు చేశారు. రాంగ్‌రూట్‌లో వాహనాలు నడిపి ప్రమాదాలకు కారణం అవుతున్నారని, ఎవరూ రాంగ్‌రూట్‌లో వాహనాలు నడపరాదని పోలీసులు హెచ్చరించారు.

అనారోగ్యంతో బెగ్గర్ మృతి

కూకట్‌పల్లి, మే 6 (ఆంధ్రజ్యోతి): అనారోగ్యం కారణంగా ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటన కూకట్‌పల్లిలో సోమవారం చోటుచేసుకుంది. ఎస్సై ప్రేమ్‌సాగర్ తెలిపిన వివరాల ప్రకారం.. కర్ణాటకలోని బీదర్ ప్రాంతానికి చెందిన రాజు(40) మూసాపేటలోని ఖైతలాపూర్ ప్రాంతానికి వచ్చి భిక్షాటన చేసుకొంటూ జీవిస్తున్నాడు. సోమవారం ఉదయం ఖైతలాపూర్ రోడ్డు పక్కన పడిపోయి ఉండడం గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. ఈ మేరకు పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించగా అప్పటికే మృతి చెంది ఉన్నాడు. రాజు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు. అనారోగ్యం కారణంగా రాజు మృతి చెందినట్లు ఎస్సై తెలిపారు.

మహిళ మెడలో నుంచి చైన్ స్నాచింగ్

హైదర్‌నగర్,మే6(ఆంధ్రజ్యోతి): మార్నింగ్ వాకింగ్‌కు వెళ్లిన మహిళ మెడలో నుంచి ద్విచక్రవాహనంపై వచ్చిన ఓ దొంగ చైన్ లాక్కుని పరారయ్యాడు. కేపీహెచ్‌బీ పోలీస్‌స్టేషన్ పరిధిలోని నిజాంపేట్‌రోడ్ మహాలక్ష్మి టవర్స్‌లో నివాసం ఉండే ప్రభుత్వ ఉపాధ్యాయురాలు ఉప్పల శైలజ సోమవారం ఉదయం 6 గంటల సమయంలో మార్నింగ్ వాకింగ్ చేస్తుంది. ఈ సమయంలో బైక్‌పై వచ్చిన గుర్తు తెలియని వ్యక్తి ఆమె మెడలో నుంచి ఆరు తులాల పుస్తెలతాడు లాక్కుని పరారయ్యాడు. ఈ మేరకు శైలజ కేపీహెచ్‌బీ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ మధుసూదన్ తెలిపారు.

రిజర్వేషన్లపై కాంగ్రెస్‌ది తప్పుడు ప్రచారం

ఈటల రాజేందర్

కూకట్‌పల్లి, మే 6 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు అందించాల్సిన ఆరు గ్యారెంటీల దృష్టిని మరల్చేందుకే కాంగ్రెస్ పార్టీ రిజర్వేషన్ల రద్దుపై తప్పుడు ప్రచారం చేస్తోందని బీజేపీ కూకట్‌పల్లి నియోజకవర్గ ఇన్‌చార్జి మాధవరం కాంతారావు అన్నారు. కూకట్‌పల్లి డివిజన్‌లోని మైత్రినగర్, ఏవీబీపురంలో పార్టీ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన ఇంటింటి ప్రచారంలో ఆయన పాల్గొని మాట్లాడారు. గాడిద గుడ్డు పేరుతో కాంగ్రెస్ పార్టీ కాలయాపన చేస్తూ ప్రజలను మభ్యపెట్టేలా వ్యవహరిస్తోందని ఆరోపించారు. బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్ గెలిస్తే మల్కాజిగిరి నియోజకవర్గ పరిధిలోని సమస్యలకు శాశ్వత పరిష్కారం లభించేలా కృషి చేస్తారన్నారు. కార్యక్రమంలో జిల్లా కో కన్వీనర్ యంజాల పద్మయ్య, కూకట్‌పల్లి అసెంబ్లీ కన్వీనర్ శ్రీకర్‌రావు, తిలోక్, నాగరాజు పాల్గొన్నారు.



యాప్రాల్‌లోని మణి ఎన్‌క్లేవ్‌లో మాట్లాడుతున్న ఈటల రాజేందర్

• కార్మికులకు బీజేపీ అండ

జీడిమెట్ల: కార్మికులకు అండగా బీజేపీ నిలబడుతుందని ఆ పార్టీ రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షుడు, అర్బన్ జిల్లా కన్వీనర్ డాక్టర్ ఎస్.మల్లారెడ్డి అన్నారు. చింతల్ జయ కన్వెన్షన్ హాల్‌లో నిర్వహించిన కార్మిక సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మల్కాజిగిరి పార్లమెంట్ అభ్యర్థి ఈటల రాజేందర్‌కు ఓటు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో శ్రీరామ, ఉషా ఇతర పరిశ్రమల కార్మికులు పాల్గొన్నారు.

• ఈటలను గెలిపించండి

వనస్థలిపురం: మల్కాజిగిరి అభివృద్ధి చెందాలంటే బీజేపీ ఎంపీ అభ్యర్థి ఈటల రాజేందర్‌ను గెలిపించాలని మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి అన్నారు. సోమవారం మన్సూరాబాద్ డివిజన్‌లోని జడ్జెస్‌కాలనీ, ఫేజ్-1, సహార స్టేట్స్, శ్రీరామహిల్స్‌కాలనీల్లో బీజేపీ శ్రేణులతో కలిసి కార్పొరేటర్ ఇంటింటికీ తిరుగుతూ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో శ్రీకాంత్, చంద్రారెడ్డి, అంజయ్యగౌడ్, రామచంద్రారెడ్డి, నాయకులు రామేశ్వర్, రాజశేఖర్ పాల్గొన్నారు.

• కర్మన్‌ఘాట్ ఓల్డ్ విలేజ్‌లో ప్రచారం

చంపాపేట: చంపాపేట డివిజన్ కర్మన్‌ఘాట్ ఓల్డ్ విలేజ్‌లో సోమవారం బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, కార్పొరేటర్ వంగా మధుసూదన్‌రెడ్డి ఇంటింటి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ కమలంపువ్వు గుర్తుకు ఓట్లేసి మల్కాజిగిరి బీజేపీ ఎంపీ అభ్యర్థి ఈటల రాజేందర్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని ఓటర్లను కోరారు. దేశంలో మోదీ పాలనకు ప్రజలు తిరిగి స్వాగతిస్తున్నారని, మోదీతోనే దేశం ముందుకు సాగుతుందన్నారు.

• దేశ రూపురేఖలు మారుతున్నయ్

నేరేడ్‌మెట్: ప్రధాని మోదీ హయాంలో భారతదేశం రూపురేఖలు మారుతున్నాయని ఈటల రాజేందర్ అన్నారు. సోమవారం నేరేడ్‌మెట్ డివిజన్ పరిధిలోని యాప్రాల్‌లోని మణి ఎన్‌క్లేవ్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశంలో ఉన్న 76 విమానాశ్రయాలు 153 అయ్యాయని, రైల్వేస్టేషన్లు విమానాశ్రయాల మాదిరిగా అభివృద్ధి చెందుతున్నాయన్నారు. దేశంలో పేదల కోసం 12 కోట్ల టాయిలెట్లు కట్టించారన్నారు. ప్రభుత్వం అంటే అభివృద్ధి ఒక్కటే కాదని, ప్రజల విశ్వాసాలనూ కాపాడాల్సిన బాధ్యత వారిపై ఉందన్నారు. ఈ ఎన్నికల్లో తనను గెలిపించాలని ఈటల కోరారు.



కర్మన్‌ఘాట్ ఓల్డ్ విలేజ్‌లో ప్రచారం చేస్తున్న కార్పొరేటర్ మధుసూదన్‌రెడ్డి,



కూకట్‌పల్లి మైత్రినగర్‌లో ప్రచారం చేస్తున్న మాధవరం కాంతారావు, నాయకులు

చోరీ చేసిన బైక్‌పై మొబైల్ స్నాచింగ్, హత్య

పాత నేరస్తుడితో పాటు మైనర్‌ని అరెస్ట్ చేసిన పోలీసులు

వ్యసనాలకు బానిసైన వారితో చోరీలు చేయిస్తున్న ముఠాలు

హైదరాబాద్ సిటీ, మే 6 (ఆంధ్రజ్యోతి): చోరీ చేసిన బైక్‌పై తిరుగుతూ మొబైల్ స్నాచింగ్ చేసి, హత్య చేసిన పాతనేరస్తుడితో పాటు అతడికి సహకరించిన మైనర్‌ను అరెస్ట్ చేసినట్లు సీపీ కొత్తకోట శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. బషీర్‌బాగ్ సీసీఎస్ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కేసు వివరాలు వెల్లడించారు. వ్యసనాలకు బానిసైన వారితో మొబైల్ స్నాచింగ్‌లు చేయిస్తున్న ముఠాలను త్వరలోనే పట్టుకుంటామని చెప్పారు. నగరంలో చోరీ చేసిన మొబైల్స్‌ను కొన్ని ముఠాలు సూడాన్, శ్రీలంక, మలేషియా దేశాలకు తరలిస్తున్నాయని గుర్తించామని తెలిపారు. త్వరలోనే ఆ ముఠా సభ్యులను అరెస్ట్ చేస్తామని తెలిపారు. గుడిమల్కాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగిన మొబైల్ స్నాచింగ్, హత్య కేసులో నిందితుడు మహ్మద్ అజీజ్ ఖురేషి అలియాస్ సోహైల్(19)పై గతంలో పలు స్నాచింగ్ కేసులున్నాయి. గోల్కొండ రేషంబాగ్ బంజారాదర్వాజా ప్రాంతంలో నివసించే మహ్మద్ అజీజ్ ఖురేషి (19)టౌలిచౌకిలోని చికెన్ సెంటర్‌లో పని చేస్తున్నాడు. ఇతడు ఓ మైనర్ సహకారంతో స్నాచింగ్‌లు చేస్తున్నాడు. రెండు రోజులు క్రితం కేపీహెచ్‌బీ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఓ బైక్ చోరీ చేసి దానిపై తిరుగుతూ మైలార్‌దేవ్‌పల్లిలో ఏప్రిల్ 30న ఓ మొబైల్‌ను స్నాచింగ్ చేశారు. రాత్రి 11.30 గంటలకు అత్తాపూర్ ఫ్లైఓవర్ పిల్లర్ నెంబర్ 66 వద్ద ఫుట్‌పాత్‌పై కూర్చొని ఫోన్ చూస్తున్న ఇద్దరిని గుర్తించారు. వారి వద్దకు బైక్ ఆపి మైనర్ బాలుడు సనావుల్లా చేతిలోని ఫోన్ గుంజుకున్నాడు. పారిపోతుండగా సనావుల్లా నిందితుల బైక్‌ను అడ్డుకొన్నాడు. దీంతో ఆవేశంతో ఊగిపోయిన మహ్మద్ అజీజ్ ఖురేషీ కత్తితో సనావుల్లా ఛాతీలో పొడిచి పారిపోయాడు. కత్తి గుండెలో గుచ్చుకోవడంతో సనావుల్లా అక్కడికక్కడే చనిపోయాడు. కేసును నమోదు చేసిన పోలీసులు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి సీసీటీవీ ఫుటేజ్‌ల ఆధారంగా నిందితుడు అజీజ్ ఖురేషీతో పాటు మైనర్‌ను గుడిమల్కాపూర్ పోలీసులు, సౌత్‌వెస్ట్‌జోన్ టాస్క్‌ఫోర్స్ సిబ్బందితో కలిసి అరెస్ట్ చేశారు. వారి నుంచి చోరీ చేసిన బైక్, రెండు కత్తులు, మూడు ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు.

ప్రజలంతా బీజేపీ వైపే ఉన్నారు

• చేవెళ్ల ఎంపీ అభ్యర్థి విశ్వేశ్వర్‌రెడ్డి



ఆదర్శనగర్‌లో ప్రచారం చేస్తున్న రవికుమార్‌యాదవ్

హైదర్‌నగర్, మే 6(ఆంధ్రజ్యోతి): చేవెళ్ల పార్లమెంట్ ప్రజలంతా బీజేపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి వెంటే ఉన్నారని శేరిలింగంపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జి రవికుమార్‌యాదవ్ అన్నారు. సోమవారం ఎన్నికల ప్రచారంలో భాగంగా పార్టీ నాయకులతో కలిసి హైదర్‌నగర్ డివిజన్ కృష్ణవేణినగర్, శ్రీరామనగర్ కాలనీల్లో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా రవికుమార్‌యాదవ్ మాట్లాడుతూ.. దేశంలో మరోసారి నరేంద్రమోదీ నాయకత్వంలోని బీజేపీ ఘన విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో రామరాజు, నవీన్‌గౌడ్, అరుణ్‌కుమార్, శేషయ్య, శ్రీనివాస్, వేణుగోపాల్‌యాదవ్, వీరాచారి, సునీల్‌రెడ్డి, సీతారామరాజు, శ్రీనివాస్, సైదులు, ఎంకె దేవ్, వెంకట్, వీరుయాదవ్, నాగరాజ్, బాలకృష్ణ, బాలాజి, కృష్ణ, సిద్దినరేష్, సైదమ్మ, జ్యోతి పాల్గొన్నారు.

శేరిలింగంపల్లిలో విస్తృత ప్రచారం

గచ్చిబౌలి: శేరిలింగంపల్లి డివిజన్ ఆదర్శ్‌నగర్, నెహ్రూనగర్, బాపునగర్, గోపీనగర్‌లో బీజేపీ ఆధ్వర్యంలో కొండా విశ్వేశ్వర్‌రెడ్డికి మద్దతుగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. శేరిలింగంపల్లి అభివృద్ధి కోసం బీజేపీకి ఓట్లు వేసి విశ్వేశ్వర్‌రెడ్డిని గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ప్రధాని ఎన్నో సాహసోపేతమైన నిర్ణయాలతో దేశాన్ని అభివృద్ధి చెందిన దేశాల సరసన నిలిపారన్నారు. 500 ఏళ్ల హిందువుల కల అయోధ్య ఆలయం నిర్మాణం, ఆర్టికల్ 370 రద్దు, జీఎస్టీ అమలు, ట్రిపుల్‌తలాక్ రద్దు, రహదారుల నిర్మాణం ఇలా ఎన్నో అభివృద్ధి పనులు చేసిన ఘనత మోదీకే దక్కుతుందన్నారు.

కాంగ్రెస్‌వి మోసపూరిత వాగ్దానాలు

• శేరిలింగంపల్లిలో రోడ్ షోలో పాల్గొన్న కేటీఆర్

• ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ

గచ్చిబౌలి, మే 6 (ఆంధ్రజ్యోతి): రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో చేవెళ్ల నియోజకవర్గంలో మూడోసారి బీఆర్ఎస్ జెండా ఎగురవేయడం ఖాయమని ఆ పార్టీ ఎంపీ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ ధీమా వ్యక్తం చేశారు. సోమవారం సాయంత్రం కొండాపూర్ ఆర్టీఏ కార్యాలయం వద్ద బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీమంత్రి కేటీఆర్ రోడ్‌షో నిర్వహించారు. ఆర్టీఏ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన సమావేశంలో జ్ఞానేశ్వర్ మాట్లాడుతూ.. గత అసెంబ్లీ ఎన్నికల్లో మోసపూరిత వాగ్దానాలు చేసి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ ప్రజలకు చేసిందేమీ లేదన్నారు. కాంగ్రెస్ పార్టీ పట్ల ప్రజల్లో వ్యతిరేకత పెరుగుతోందని తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే గాంధీ మాట్లాడుతూ.. రాష్ట్రం ఏర్పడిన తర్వాత చేవెళ్ల పార్లమెంట్ స్థానాన్ని వరుసగా బీఆర్ఎస్ గెలుస్తూ వస్తోందని, ఈ ఎన్నికల్లోనూ బీఆర్ఎస్ విజయఢంకా మోగిస్తుందని తెలిపారు. ఈ ఎన్నికల్లో కాసాని జ్ఞానేశ్వర్‌కు ఓట్లు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు రాగం నాగేందర్‌యాదవ్, ఉప్పలపాటి శ్రీకాంత్, నార్నె శ్రీనివాసరావు, మంజులారెడ్డి, మాజీ కార్పొరేటర్ కొమిరిశెట్టి సాయిబాబాతో పాటు నాయకులు రాజుయాదవ్, గణేష్‌ముదిరాజ్, శ్రీనివాస్‌యాదవ్‌తో పలువురు నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ

• చేవెళ్లలో మూడోసారి బీఆర్ఎస్ జెండా ఎగురవేస్తాం

మియాపూర్: చేవెళ్ల పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్ గెలుపునకు ఆల్విన్‌కాలనీ ఫేజ్-1 కాలనీవాసులు మద్దతు తెలిపారు. సోమవారం ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ పార్టీ నాయకులతో కలిసి ఆల్విన్‌కాలనీ ఫేజ్-1 సభ్యులతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. కారు గుర్తుకు ఓట్లు వేసి జ్ఞానేశ్వర్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. సమావేశానికి హాజరైన కాసాని జ్ఞానేశ్వర్‌కు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఆల్విన్‌కాలనీ ఫేజ్-1 కాలనీవాసులు జ్ఞానేశ్వర్‌కు మద్దతు తెలపడం గొప్ప విషయమన్నారు. రాష్ట్రం ఏర్పడినపట్టి నుంచి చేవెళ్లలో బీఆర్ఎస్ వరుసగా గెలుస్తూ వచ్చిందన్నారు. జ్ఞానేశ్వర్‌ను గెలిపించి కేసీఆర్‌కు కానుకగా ఇస్తామన్నారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ రంగారావు, మాజీ కార్పొరేటర్లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ

• సొంతగూటికి ఇమామ్

మియాపూర్: కొండాపూర్ డివిజన్ పరిధిలోని ప్రేమ్‌నగర్‌కు చెందిన సీనియర్ నాయకుడు ఇమామ్ ఇటీవల కాంగ్రెస్‌లో చేరారు. కాగా సోమవారం తిరిగి ఎమ్మెల్యే గాంధీ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఎమ్మెల్యే ఆయనకు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.



ఇమామ్‌ను బీఆర్ఎస్‌లోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే గాంధీ

ఎన్‌డీఏ ప్రభుత్వం ఏర్పాటు చేస్తుంది

కేంద్ర సహాయక మంత్రి రాందాస్ అథవాలే

హైదర్‌నగర్, మే 6 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల్లో తెలంగాణాలో బీజేపీ అత్యధిక లోక్‌సభ సీట్లు గెలుచుకుంటుందని, అదేవిధంగా ఆంధ్రప్రదేశ్‌లో కూటమి అధికారంలోకి రావడం ఖాయమని కేంద్ర సామాజిక న్యాయ, సాధికారికత మంత్రిత్వశాఖ సహాయ మంత్రి రామ్‌దాస్ అథవాలే అన్నారు. సోమవారం కూకట్‌పల్లి ఆల్విన్‌కాలనీ ఎల్లమ్మబండలోని శిల్పబృందావన్ కాలనీలోని ఆయన సన్నిహితులు కొల్లి శ్రీనివాస్, స్వప్న దంపతుల ఇంటికి వచ్చి వారిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మోదీ హయాంలో ప్రపంచ దేశాలలో భారతదేశాన్ని ఆర్థికంగా 5వ స్థానంలో నిలబెట్టారని, ఆర్టికల్ 370, ట్రిపుల్ తలాక్ రద్దు, దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న కుటుంబాల సంఖ్య గణనీయంగా తగ్గిందని, ఎన్నో సంక్షేమ పథకాలను అమలు చేశారని తెలిపారు. రిజర్వేషన్ రద్దు చేస్తారని, ప్రజలను కాంగ్రెస్ పార్టీ తప్పు దోవ పట్టిస్తోందని, అబ్‌కీ బర్ చార్ సౌపార్ నినాదం దేశమంతా గట్టిగా వినిపిస్తోందని ఎన్డీయే కచ్చితంగా 400పైగా సీట్లను కైవసం చేసుకుటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా (అథవాలే) ఆంధ్రప్రదేశ్ అధ్యక్షుడు బ్రహ్మానందరెడ్డి, పార్టీ నాయకులు పాల్గొన్నారు.